ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 22 నవంబరు 2024



న్యూస్ బాక్స్


ఎన్‌హెచ్ఆర్‌సీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా దిలీప్

పెద్దపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు మాచిడి దిలీప్‌ను జాతీయ మానవ హక్కుల మండలి (ఎన్‌హెచ్ ఆర్సీ) ఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు అయిలినేని శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా వైద్య శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీగా ఎం కృష్ణ మూర్తి, ఏ జిల్లా కో-ఆర్డినేటర్‌గా డి సరిత, పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా జే ప్రభాకర్, మంథని మండల ఉపాధ్యక్షులుగా ఎం మనోజ్ కుమార్‌ను నియమించారు. జాతీయ మానవ హక్కుల మండలి ఎన్జీఓ జిల్లా కమిటీ ఎన్నికకు, తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షులు అయిలినేని శ్రీనివాసరావుకు మాచిడి దిలీప్ కృతజ్ఞతలు తెలిపారు.

24న ప్రజాపాలన.. ప్రజావిజయోత్సవాలు

మంథని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అవుతున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 24న ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని స్థానిక శివకిరణ్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంచార్జి పౌర సంబంధాల అధికారి బీ. జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రభుత్వం పిలిచింది అనే కళాబృందం డప్పు నాగరాజు ఆధ్వర్యంలో మంథనిలో ప్రభుత్వ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి కళా ప్రదర్శనలు ఇస్తారన్నారు. ఈకార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. వీటిలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'రుడా'తో ఊరట



- రామగుండానికి బీ గ్రేడ్ హోదా లభించే అవకాశం
- జిల్లాలోని 25వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ప్రయోజనం
- ఒక్కొక్కరికి నెలకు రూ.3500
- రూ.4వేల వరకు పెరగనున్న వేతనాలు
- కేంద్ర పట్టణాభివృద్ధి, కార్మిక శాఖల అనుమతితో అమలు

కోల్‌సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) విస్తరించిన ప్రాంతానికి బీ గ్రేడ్ హోదా లభించనున్నది. దీంతో జిల్లాలోని వివిధ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 25వేల మంది కాంట్రాక్టు కార్మికులకు వరంగా మారనున్నది. ఒక్కో కార్మికునికి క్యాటగిరీని బట్టి రూ.3500 నుంచి రూ.4000 వరకు నెలసరి వేతనాలు పెరగనున్నాయి. ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం సిమెంట్, మిషన్ భగీరథ కార్పొరేషన్, కాళేశ్వరం ప్రాజెక్టు, ఆసుపత్రులు, హెచ్‌పీసీఎల్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, రైల్వే, రైస్‌మిల్లుల్లో పని చేస్తున్న కార్మికులకు ప్రయోజనం కలుగనున్నది.

నగరాల విభజన..

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ దేశంలోని నగరాలను ఏ, బీ,సీ గ్రేడ్‌లుగా విభజిస్తుంది. జనాభాను బట్టి ఈ హోదాలు లభించనున్నాయి. 25లక్షలపైన జనాభా ఉన్న నగరాలను ఏ క్యాటగిరిలో, 5 నుంచి 25లక్షలు జనభా ఉన్న నగరాలను బీ క్యాటగిరిలో, 5లక్షల కన్నా తక్కువ జనాభా ఉన్న నగరాలను సీ క్యాటగిరిలుగా విభజిస్తారు. రాష్ట్రంలో మెట్రోపాలిటన్ సిటీగా ఉన్న హైదరాబాద్ ఏ క్యాటగిరిలో ఉండగా వరంగల్ బీ క్యాటగిరిలో, రామ గుండం నగరపాలక సంస్థ ప్రాంతం సీ క్యాటగిరిలో ఉన్నది. దీన్ని అనుసరించి కేంద్ర కార్మిక శాఖ అన్‌స్కిల్డ్, సెమిస్కిల్డ్, స్కిల్డ్, హైస్కిల్డ్ రేట్లను క్యాటగిరిల వారీగా విభజించారు. ఈ ఏడాది అక్టోబరు 1వ తేదిన కొత్త వీడీఏ రేట్లతో సర్క్యులర్ జారీ చేసింది. జిల్లాలో రుడా ఏర్పాటుతో రామగుండం నగరంతో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ విస్తరించిన ప్రాంత జనాభా 7లక్షలకు చేరుకుంటుంది. దీంతో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిబంధనల ప్రకారం బీ క్యాటగిరి నగరంగా మారేందు కు అవకాశం ఏర్పడింది.

వేతనాల్లో భారీ తేడాలు..

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నగరాలను ఏ, బీ, సీ క్యాటగిరిలుగా విభజించడంతో దాన్ని అనుసరించే కార్మిక శాఖ వేతనాలను నిర్ణయించింది. ఏ, బీ, సీ క్యాటగిరిల వారీగా అన్‌స్కిల్డ్, సెమిస్కిల్డ్, స్కిల్డ్, హైస్కిల్డ్ వేతనాలను నిర్ణయించారు. ఏ క్యాటగిరి నగరాల్లో అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.523 రోజువారి వేతనం ఉంటే, బీ క్యాటగిరి నగరాల్లో రూ.437, సీ క్యాటగిరి నగరాల్లో రూ.350 వేతనం ఉంటుంది. వీడీఏలో కూడా ఇదే విధంగా వ్యత్యాసం ఉంది. ఏ క్యాటగిరి నగరాల్లో అన్‌స్కిల్డ్‌కు రూ.260 వీడీఏ ఉంటే, బీ క్యాటగిరికి రూ.218, సీ క్యాటగిరికి రూ.176 మాత్రమే వీడీఏ ఉంటుంది. అంటే మొత్తంగా హైదరాబాద్‌లో అన్‌స్కిల్డ్ కార్మికుడికి రోజు వారి వేతనం రూ.783, వరంగల్‌లో పనిచేసే కార్మికుడికి రూ.655 ఉంటే, రామగుండం, పెద్దపల్లి వంటి ప్రాంతాల్లో పని చేసే కార్మికుడికి రూ.526మాత్రమే రోజువారి వేతనం ఉంటుంది. వేతనం, డీఏ కలిపి సెమిస్కిల్డ్‌లో బీ గ్రేడ్‌నగరాల్లో రూ.739ఉంటే, సీగ్రేడ్ నగరాల్లో రూ.614గా ఉంది, స్కిల్డ్‌లో బీగ్రేడ్ నగరాల్లో రూ.868 ఉంటే, సీ గ్రేడ్‌లో రూ.739ఉంటుంది. హైస్కిల్డ్‌లో రూ.954 బీ గ్రేడ్‌లో ఉండగా, సీ గ్రేడ్‌లో రూ.868గా ఉంది. అన్‌స్కిల్డ్ కార్మికులకు సరాసరి రూ.129, సెమిస్కిల్డ్ కార్మికులకు రూ.125, స్కిల్డ్ కార్మికులకు రూ.129 రోజు వారి వేతన వ్యత్యాసం ఉంది. రుడా ఏర్పాటుతో దాని పరిధిలోని ప్రాంతానికి బీ గ్రేడ్ గుర్తింపు వస్తే వివిధ రంగాల్లో పని

మిగతా 8వ పేజీలో...



రైస్‌మిల్లుల్లో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

రైస్ మిల్లుల్లో సక్రమంగా ధాన్యం దిగుమతి చేసుకోవాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

8



కర్మాగారం ఎదుట బైఠాయించిన కాంట్రాక్టు కార్మికులు

మెరుగైన దీపావళి బోనస్ చెల్లించాలి

- కేశోరాం కాంట్రాక్టు కార్మికుల నిరసన

8

కార్పొరేటర్లూ.. ఫోన్లు జాగ్రత్త..!

- రామగుండం ప్రజాప్రతినిధులకు రూ.13లక్షలతో ఫోన్లు
- రెండు నెలల్లో ముగియనున్న పాలకవర్గ గడువు..
- హైకోర్టు తీర్పును అనుసరించి ఫోన్లు వాపసు ఇవ్వాల్సిందే..
- వాపసు ఇవ్వకపోతే మళ్లీ పోటీకి అనర్హులే..

కోల్‌సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):రామగుండం నగరపాలక సంస్థ ప్రజా ప్రతినిధులు ఇప్పుడు తమ వద్ద ఉన్న ఫోన్లను జాగ్రత్తగా చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు రూ.13లక్షల ప్రజాధనంతో కార్పొరేటర్లు, కీలక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఫోన్లు కొనుగోలు చేశారు. ఇందులో 50 మంది కార్పొరేటర్లకు ఒక మోడల్, కీలక ప్రజాప్రతినిధి, అధికారులకు విలువైన ఫోన్లు కొనుగోలు చేశారు. తెలంగాణ టెక్నికల్ సర్వీసెస్ ఏజెన్సీగా వీటి సరఫరా జరిగింది. కార్పొరేటర్లకు ఇచ్చిన ఫోన్లు రూ.23వేల విలువైనవి. వీటితో పాటు మరో రెండు విలువైన ఐఫోన్లను కొనుగోలు చేశారు. హైకోర్టు తీర్పును అనుసరించి ప్రజాప్రతినిధులు తమ పదవీకాలం పూర్తికాగానే మున్సిపల్ నుంచి తీసుకున్న ఫోన్లు, సిమ్ కార్డులను కండీషన్‌లో తిరిగి కార్యాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. గత పాలకవర్గంలోను ఇదే రీతిలో ట్యాబ్‌లు వాపసు వచ్చాయి. ఒకవేళ ఫోన్లు వాపసు చేయకపోతే వారు కార్పొరేషన్‌కు బకాయిదారుల జాబితాలో చేరుతారు. తదుపరి మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అనర్హులవుతారు. అంతేకాకుండా ఈ బకాయిలను వారి ఆస్తి పన్ను, ఇతర పన్నుల్లో కూడా జమచేసేందుకు అవకాశం ఉంటుంది. కొందరు కార్పొరేటర్లు ఈ ఫోన్లు వాడకుండా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో పాలకవర్గ గడువు ముగుస్తుండడంతో ఫోన్లను వెతుక్కుంటున్నామని పలువురు పేర్కొంటున్నారు.

కీచులాటపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

జూలపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కీచులాటపల్లిలో పంచాయతీ కార్యదర్శి భానుప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీవో అనిల్‌రెడ్డి తెలిపారు. కొన్నేళ్ల క్రితం ఓదెల మండలం కొలనూరులో పంచాయతీ కార్యదర్శిగా భానుప్రసాద్ పనిచేశాడు. గ్రామసభ నిర్వహించకుండా పౌల్ట్రిఫామ్ నిర్మాణానికి అనుమతి పత్రం ఇచ్చాడని పేర్కొంటూ ఒక వార్డు సభ్యుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన అధికారులు నివేదిక ఆధారంగా భానుప్రసాద్‌ను కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు ఎంపీవో తెలిపారు.

రూ.24.81లక్షల మొండి బకాయి చెల్లింపు



కమిషనర్ అరుణశ్రీకి చెక్కును అందజేస్తున్న ఆస్తిపన్ను బకాయిదారులు

కోల్‌సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో ఆస్తి పన్ను బకాయి వసూలు చేయడానికి రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగించడంతో ఒక్కొక్కరిగా మొండి బకాయిదారులు బకాయిలు చెల్లిస్తున్నారు. గురువారం మాతంగి కాలనీలోని 22-8-115కు సంబంధించి నగరపాలక సంస్థకు బకాయి పడిన ఆస్తి పన్ను రూ.24.81లక్షలు వసూలు అయ్యింది. యజమానుల తరఫున హర్ష, వెంకటేషం, నూరుల్ హుస్సేన్‌లు ఈ బకాయి చెల్లించారు. అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీకి స్వయంగా చెక్కును అందజేశారు. రెవెన్యూ సూపరింటెండెంట్ ఆంజనేయులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, శంకర్‌రావు ఉన్నారు.

మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న మోదీ

- మత విద్వేషాల నుంచి తెలంగాణను రక్షించుకుందాం... - వామపక్ష నేతలు



అభివాదం చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తూ ప్రజలను మతోన్మాదం పేరుతో రెచ్చగొడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే రాజన్న, నంది రామయ్య, ఎం శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన మతోన్మాద వ్యతిరేక సదస్సులో వారు పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ ప్రజల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారని, మతం వ్యక్తిగతమే కానీ, మతం పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. దేశంలో రోజు రోజుకు కులం, మతం ప్రాంతం పేరిట ప్రజల ఆలోచనలను వక్రమార్గం పట్టిస్తున్నారని, మహిళలు, దళితులు, ఆదివాసీల మీద అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలను చైతన్యం చేయడానికి, మత సామరస్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు, పౌర హక్కులు, లౌకిక ప్రజాస్వామ్యం, సామరస్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం చట్టాలకు వ్యతిరేకంగా మతోన్మాదం, కులోన్మాదంకు తెలంగాణ చోటులేదని, దీనిని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో నాయకులు కే కనకరాజు, మహేశ్వరి, నరేష్, శ్రీనివాస్, రామకృష్ణ, కుమారస్వామి, ఐ కృష్ణ, రమేష్, చంద్రశేఖర్, వెకన్న, ఉపేందర్‌తో పాటు 200మంది సదస్సుకు హాజరయ్యారు.

ఆసుపత్రి భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి : కలెక్టర్

పెద్దపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆసుపత్రి వద్ద మరో 50 పడకల భవన నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో జరుగుతున్న భవన నిర్మాణాల పురోగతి, టీజీఎంఎస్ ఐడీసీ పనులపై సంబంధిత అధికారుల తో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గోదావరిఖని జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల స్థితిగతులపై సమీక్షించిన కలెక్టర్ వేగవంతంగా వాటిని పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేసి స్థలం అందుబాటులో ఉన్నందున మరో 50 పడకల భవన నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు తయారుచే యాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ దేవేందర్, డీఈ రవీందర్, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

రామగుండంలో పెరిగిన చలి తీవ్రత

- 14డిగ్రీలకు పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నవంబర్‌లోనే చలి తీవ్ర పెరిగి గజగజ వణికిస్తుంది. ఐదు రోజులుగా క్రమంగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గుతూ వచ్చాయి. దీంతో ఉన్ని దుస్తుల వ్యాపారం ఊపందుకున్నది. ఆదివారం 16డిగ్రీలు రాత్రిపూట ఉష్ణోగ్రత నమోదు కాగా, సోమవారం 15.9డిగ్రీలు, మంగళవారం 15.2డిగ్రీలు, బుధవారం 14.5 డిగ్రీలకు చేరుకున్న. ఇది సాధారణ ఉష్ణోగ్రతల కంటే 3.4డిగ్రీలు తక్కువ. గోదావరిఖనిలో పలుచోట్ల ఏర్పాటుచేసిన ఉన్నిదుస్తుల కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. స్వెటర్, జంపర్, మంకీ క్యాప్‌లు, హ్యాండ్ గ్లౌజ్‌లతోపాటు మఫ్లర్లతో పాటు బ్లాంకెట్లు, రగ్గులు, శాలువాలకు డిమాండ్ పెరిగింది. గత ఏడాదికంటే ఇప్పుడు వ్యాపారులు సిండికేట్‌గా మారి ఉన్నిదుస్తులను విక్రయిస్తున్నారు. అకస్మాత్తుగా చలిపెరగడంతో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది. గత ఏడాది నవంబర్ మాసంలోకంటే ఈ ఏడాది చలి తీవ్రత పెరిగింది. రాత్రి 7గంటలు దాటితే జన సంచారం తగ్గి నిర్మానుశ్యంగా కనిపిస్తున్నాయి. ఉదయం కూడా చలి తీవ్ర ఎక్కువగా ఉంటుంది. ఉదయం 9గంటల దాటినా చలి ప్రభావం తగ్గడం లేదు. ఉదయం షిఫ్టులకు వెళ్లే కార్మికులు ఉన్ని దుస్తులు ధరించి విధులకు హాజరవుతున్నారు.

మరో 950 ఎకరాల్లో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ పూర్తిచేయాలి : కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మరో 950 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కల ప్లాంటేషన్ జనవరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయిల్‌పామ్ మొక్కల గ్రౌండింగ్‌పై సంబంధిత అధికారులతో కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నాటికి జిల్లాలో కొత్తగా 950ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కల ప్లాంటేషన్ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు ఆయిల్‌పామ్ మొక్కల ప్లాంటేషన్ సాధన దిశగా వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు వచ్చిన రైతుల నుంచి మొక్కలకు, డ్రిప్ కోసం వెంటనే డీడీలు సేకరించాలని తెలిపారు. డీడీలు సమర్పించిన రైతులకు మొక్కల సరఫరా, డ్రిప్ సౌకర్యం ఏర్పాటు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీహెచ్ఎస్‌వో జగన్మోహన్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ హేమంత్ కుమార్

పెద్దపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీలో ఖాళీగా ఉన్న 3పోస్టుల భర్తీకి డిసెంబరు 5లోపు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీలో 1 స్టెనో/టైపిస్టు, 1 టైపిస్ట్ కం అసిస్టెంట్, 1 రికార్డు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీకి సంబంధించి ఈనెల 19న నోటిఫికేషన్ విడుదల చేశామని, డిసెంబరు 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 7లోపు దరఖాస్తులను స్క్రూటినీ చేసి, 10న హాల్ టికెట్లు జారీ చేస్తామని పేర్కొన్నారు. 14న ఓఎంఆర్ పరీక్ష ఉంటుందని, 16న స్కిల్ టెస్ట్, 20న ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. స్టెనో/టైపిస్ట్, టైపిస్ట్ కం అసిస్టెంట్ పోస్టుకు డిగ్రీ, టైప్‌రైటింగ్, షార్ట్‌హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణత సాధించాలని, రికార్డ్‌అసిస్టెంట్ పోస్టుకు పదవ తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, అభ్యర్థులకు తెలుగు భాషపై పట్టు ఉండాలని, ఆసక్తిగల అభ్యర్థులు డిసెంబర్ 5 సాయంత్రం ఐదు గంటలలోపు చేరేలా దరఖాస్తులను రిజిస్టర్ పోస్ట్ లేదా కొరియర్ ద్వారా మాత్రమే పంపాలని, నేరుగా దరఖాస్తులు తీసుకోవడం జరగదని లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ పేర్కొన్నారు.

టీచర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిమేడారం బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ టీచర్ పోస్టు భర్తీకి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విద్యాసాగర్ తెలిపారు. 6,7,8 తరగతులకు ఆంగ్లం బోధించేందుకు ఎంఏ, ఇంగ్లీష్‌తోపాటు బీఈడీ చేసి ఉండాలన్నారు. అర్హులకు డెమో నిర్వహించి నియమిస్తామని, వివరాలకు 7702100881 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

పీఎం అజయ్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పీఎం అజయ్ పథకానికి ఎస్సీ రైతులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వం ద్వారా వ్యవసాయ భూమి(కొనుగోలు లేదా అసైన్డ్ భూములు) పొందిన షెడ్యూలు కులాల లబ్ధిదారులు ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద సదరు భూముల్లో బోర్‌వెల్స్ డ్రిల్లింగ్ చేసి నీటి వసతి కల్పించడానికి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ఆసక్తిగల ఎస్సీ రైతులు దరఖాస్తులతో పాటు పట్టాదారు పాసు పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను జత చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

అవసరమైతేనే యాంటీబయోటిక్స్ వాడాలి..

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అవసరమైతే వైద్యుల సూచన మేరకు యాంటీ బయోటిక్స్ మందులను వాడాలని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రిన్సిపాల్ హిమబిందు అన్నారు. ప్రపంచయాంటీ మైక్రో బయల్ రెసిస్టెంట్ అవర్నెస్ సందర్భంగా గురువారం సిమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇన్ఫెక్షన్ నివారించడానికి యాంటీ బయోటిక్ మందులు ఉపయోగపడుతాయని, యాంటి బయోటిక్‌ను తగ్గించుకోవడానికి అనేక విధానాలు అవలంభించవచ్చునని చెప్పారు. ఇన్ఫెక్షన్ నివారణ, నియంత్రణను బలోపేతం చేయడానికి ఆరోగ్యం సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ప్రొఫెసర్లు ఓబులేష్, అనంతబాబు, అశోక్, అరుణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు

- భయాందోళనలో ప్రజలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి



రుక్మాపూర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు

చొప్పదండి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ నుంచి కాట్నపల్లి దారిలో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారాయి. ఒక లైన్ మీదుగా మరో లైన్ వెళ్తోంది. మోడల్ స్కూల్ వైపుకు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ ఫీడర్ పై నుంచి కాట్నపల్లి లైన్ పోతున్నది. దీంతో రెండు కలిసిపోయే ప్రమాదం ఉంది. స్తంభం ఒక వైపుకు ఒరిగిపోగా విద్యుత్ తీగలు సమీపంలోకి వచ్చాయి. తీవ్రమైన గాలి వీస్తే వైర్లు తాకితే మంటలు చెలరేగే ప్రమాదం ఉంది. గతంలో రెండు లైన్లు కలిసిపోయిన చోట విధుల్లోఉన్న హెల్పర్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ప్రమాదం చోటు చేసుకున్నా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మినీ స్టేడియం నిర్మాణం పూర్తయ్యేనా?

- శంకుస్థాపన చేసి ఏడాదైనా కదలని పనులు
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

హుజూరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి మోక్షం కలగకపోవడంతో క్రీడాకారులకు తిప్పలు తప్పడం లేదు. హుజూరాబాద్ క్రీడలకు పేరుంది. క్రీడాకారుల సంఖ్య కూడా అధికంగానే ఉంది. కాగా మినీ స్టేడియం లేని కారణంగా క్రీడాకారులు సాధన చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. హుజూరాబాద్‌లో మినీ స్టేడియం నిర్మాణం చేపట్టాలని గత 20ఏళ్లుగా డిమాండ్ ఉంది. గతంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి మినీ స్టేడియం ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వగా అలాగే మిగిలిపోయింది. మండలానికో స్టేడియం ఉండాలనే ప్రభుత్వ నిబంధనలతో 2023లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ కింద



హుజూరాబాద్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేసే హైస్కూల్ మైదానం

రూ. 10కోట్ల వ్యయంతో హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో మినీ స్టేడియంకు శంకుస్థాపన చేశారు. జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి గెలిచినా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరాజయం కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో మినీ స్టేడియం నిర్మాణానికి మోక్షం లేకుండా పోయింది.

● క్రీడలకు అడ్డాగా హుజూరాబాద్

హుజూరాబాద్‌కు క్రీడలకు అడ్డాగా గుర్తింపు ఉంది. ఇక్కడి హైస్కూల్ మైదానంలో నిత్యం వందలాది మంది క్రీడకారులు సాధన చేస్తుంటారు. హాకీ, కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల్లో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కూడా ప్రతిభ కనబరుస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని హుజూరాబాద్ పట్టణానికి నడిబొడ్డున హైస్కూల్ మైదానం ఉండడంతో అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని రూ. 10 కోట్ల వ్యయంతో మినీ స్టేడియం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. హైస్కూల్ మైదానాన్ని మినీ స్టేడియంగా మార్చి అందులో హాకీ, కబడ్డీ, వాలీబాల్ తదితర కోర్టులను ఏర్పాటుకు మ్యాప్ కూడా సిద్ధం చేశారు. మినీ స్టేడియం ఏర్పాటు కాకపోవడంతో ఉదయాన్నే మైదానానికి వచ్చే వాకర్స్‌కు, క్రీడాకారులకు ఇబ్బందిగా మారింది. క్రీడాకారులకు సౌకర్యార్థం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, జిల్లా అధికారులు చొరవ తీసుకొని మినీ స్టేడియం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

క్రీడాకారులకు శాపంగా మారిన మినీ స్టేడియం

- బండ కిషన్, క్రీడాకారుడు, హుజూరాబాద్



హుజూరాబాద్ మినీ స్టేడియం నిర్మాణానికి పునాదులు పడకపోవడంతో క్రీడాకారులకు శాపంగా మారింది. హుజూరాబాద్‌లో క్రీడాకారులకు కొదువ లేదు. ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. మినీ స్టేడియం నిర్మిస్తే మరింత మందిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దే అవకాశం ఏర్పడుతుంది. మంత్రులు, జిల్లా అధికారులు కృషి చేసి మినీ స్టేడియం నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి.

కొండగట్టులో దీపారాధన



కొండగట్టులో దీపాలు వెలిగిస్తున్న అడిషనల్ కమిషనర్

మల్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న కార్తికదీపోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో గురువారం భక్తులతో కలిసి కరీంనగర్ దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ సుప్రియ కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో రామకృష్ణరావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, అర్చకులు, వేదపండితులు, ఆగమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు

అంజన్న ఆలయం హుండీ లెక్కింపు

మల్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,04,36,365 నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో ఎం.రామకృష్ణ రావు తెలిపారు. 75 రోజులకు గాను ఆలయంలోని 12 హుండీలను విప్పి గురువారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 60గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల మిశ్రమ వెండి, 78విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, ఏఈవో వై. అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, అధికారులు, సిబ్బంది, శ్రీలలిత సేవా ట్రస్ట్ సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.



హుండీ సొమ్ములు లెక్కిస్తున్న సిబ్బంది

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



రమేశ్(ఫైల్)

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన మ్యాకల రమేశ్ (27) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన మ్యాకల నర్సయ్య, లచ్చవ్వ దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. పది సంవత్సరాల క్రితం కుమారుడు, కూతురు మృతి చెందడంతో ఇద్దరే ఉంటూ వచ్చారు. చందుర్తి మండలం రామరావుపల్లి గ్రామానికి చెందిన తమ సమీప బంధువు సాయిలు-సుగుణ దంపతుల చిన్న కుమారుడు రమేష్‌ను మూడు సంవత్సరాల క్రితం దత్తత తీసుకున్నారు. రెండు సంవత్సరాల క్రితం రమేష్‌కు అంగరంగ వైభవంగా వివాహం చేశారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ శివారులోని పెట్రోల్‌బంక్‌లో ఉపాధి కోసం పని చేస్తున్నాడు. కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన శాంసన్, వట్టింల గ్రామానికి చెందిన సాయి అనే యువకులతో కలిసి శాత్రాజుపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో మ్యాకల రమేష్‌కు తలకు తీవ్రగాయాలతో మృతి చెందాడు. శాంసన్, సాయిలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కొడుకులు లేరని దత్తత తీసుకున్న తల్లిదండ్రులు, మంచిగా బతకాలని దత్తత ఇచ్చిన కన్న తల్లిదండ్రులు కొడుకు అకాల మరణంతో రోదించిన తీరుకు స్థానికులు కన్నీటి పర్యంతం అయ్యారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు..

మానకొండూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంషాబాద్ బస్టాండ్ వద్ద గురువారం మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు, బైకును ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. శంకరపట్నం మండలంలోని చింతగట్టు గ్రామానికి చెందిన కర్క మల్లారెడ్డి (68) అనే రైతు మోటార్‌సైకిల్(టీఎస్ 02ఈకే 8607)పై మండలంలోని గట్టుదుద్దెనపల్లి పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోసుకొని ఇంటికి తిరిగి వెళుతున్నాడు. వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీఎస్ 23 జడ్ 0015) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లారెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మల్లారెడ్డి భార్య కర్క విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

మానేరు నీటిలో మునిగి యువకుడు..



అనిల్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణ శివారులోని మానేరు కరకట్ట వద్ద కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన జంగిలి అనిల్(37) అనే యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. టౌన్ సీఐ కె కృష్ణ వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి గ్రామానికి తన తండ్రి బాగా లేడని చూసేందుకు ఇటీవల వచ్చాడు. తిరిగి ఈనెల 19న తెల్లవారుజామున నిజామాబాద్ వెలుతున్నానని చెప్పి ప్రమాదవశాత్తు మానేరు నీటిలో గురువారం శవమై తేలాడు. అనిల్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. నిజామాబాద్‌కు ఇల్లరికం వచ్చి ఇక్కడే ఉంటున్న తన భర్త అనిల్ తండ్రిని చూసి వస్తానని మండెపల్లికి వెళ్లాడని, తిరిగి వస్తూ చేపల వేటకు మానేరులోకి దిగి ఊపిరాడక నీటిలో మునిగి మృతిచెందాడని భార్య గీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో వానరం మృతి



మృతి చెందిన వానరం

రామడుగు, నవంబరు 21 (ఆంధ్యజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో వానరం మృతి చెందింది. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఉన్న విద్యుత్ వైర్లను వానరం పట్టుకొని స్తంభం ఎక్కే సమయంలో షాక్‌కు గురై తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. వానరం మృతి విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి సరఫరాను నిలిపివేయించారు. అనంతరం గ్రామస్థుల సహాయంతో వానరాన్ని ఖననం చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మంథని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరం క్రాస్‌రోడ్డు రోడ్డు ప్రమాదంలో గురువారం దంపతులకు గాయాలయ్యాయి. మండలంలోని గుంజపడుగు ప్రాథమిక పాఠశాలలో విధులు ముగించుకొని టీచర్ అగజ తన భర్త గంగారెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మంథని-గోదావరిఖని ప్రధాన రహదారి ఎక్కే క్రమంలో విలోచవరం క్రాస్‌రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో వారు కింద పడటంతో తలకు, శరీరంలో పలుచోట్ల గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాట్సప్‌కు ఎస్‌బీఐ పేరిట లింక్‌లు

మల్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాట్సప్‌లో ఎస్‌బీఐ పేరిట వచ్చిన ఏపీకే లింక్‌లు సెల్‌ఫోన్ వినియోగదారులను ఆందోళన గురిచేశాయి. ఎస్‌బీఐ కేవైసీ చేసుకోవాలని వచ్చిన లింక్‌లతో పలువురి ఫోన్‌లు హ్యాక్ అయ్యాయి. మండలంలోని ముత్యంపేటకు చెందిన యాల్ల మధురెడ్డికి చెందిన వాట్సప్ హ్యాక్ కావడంతో అతని నంబరు గల వారందరితో పాటు వందలాది గ్రూప్‌లకు గురువారం వేకువజామున ఎస్‌బీఐ పేరిట లింక్‌లు వచ్చాయి. కాగా ఇటీవల ఏపీకే పేరిట వచ్చే వాటిని ఓపెన్ చేయవద్దనే సూచనలతో సెల్‌ఫోన్ వినియోగదారులు అప్రమత్తం అయ్యారు. వెంటనే వాటిని తొలగించి మధురెడ్డికి సమాచారం అందించారు. దీంతో అతను వాట్సప్ ఫోన్ నుంచి అన్‌ఇన్‌స్టాల్ చేసి మళ్లీ ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. అప్పటికే కొందరు ఓపెన్ చేసినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-363పై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. గోదావరిఖనికి చెందిన నలుగురు కారులో కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి దర్శనం నిమిత్తం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీరాంపూర్ వద్దకు రాగానే జాతీయ రహదారిపై ముందు ప్రయాణిస్తున్న ఎక్స్‌కావేటర్(జేసీబీ)ను ఢీకొట్టారు. దీంతో కారు హైవే దిగి కింద ఉన్న సర్వీస్ రోడ్డుపైకి వెళ్లింది. కారు బెలూన్లు తెరచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. నలుగురికి గాయాలు కావడంతో క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన కారు రోడ్డు మధ్యలో ఉండడంతో ఢీకొన్న ఎక్స్‌కావేటర్‌తోనే పక్కకు తొలగించారు. ప్రమాదంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి గాయాలు

భీమారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో గోదావరిఖనికి చెందిన జక్కుల ఐలయ్య, గాదె పోశంలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖనికి చెందిన ఐలయ్య పోశంలు చెన్నూరుకు వెళ్తుండగా ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో పోశంకు తీవ్ర గాయాలు కాగా ఐలయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

ఎక్సైజ్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించండి

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ డివిజన్ ఎక్సైజ్ అధికారులతో గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో జరుగుతున్న పనితీరుపై ఆయన సమీక్షించారు. మొదట ఆయన ఎక్సైజ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మాట్లాడుతూ ఎక్సైజ్ అధికారులు డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తోపాటు నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. వీటితోపాటు పోలీసుఠాణాలలో వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను డిస్పోజల్ అధికారి అనుమతితో కాల్చివేయాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా చర్యలు పేట్టాలన్నారు. స్టేషన్లలో చార్జీషీట్ వేయని కేసుల్లో వెంటనే చార్జీషీట్స్ వేయాలని, కేసుల్లో శిక్షలు పడేవిధాంగా చర్యలు చేపడితే ఎక్సైజ్ క్రైమ్ చేయాలంటే నేరస్థులు భయపడుతారని అన్నారు. మద్యం ఎంఆర్‌పీ ధరలు కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపే విషయంపై కూడా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ టి డెవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ కె వరప్రసాద్, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్లు పి శ్రీనివాసరావు, ఏ సత్యనారాయణ, ఎస్ పంచాక్షరీ, ఆర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇదిలాపూర్‌కు చెందిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శివరాత్రి వివాహిత స్వప్న(35)ను కాల్వశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ధారంగుల రాజయ్య ఎప్పుడు ఫోన్‌చేసి అసభ్యకర మాటలు మాట్లాడడం వలన ఈనెల 18న తన ఇంటిలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు స్వప్నను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి తల్లి పోచమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

జాతీయ ఉత్తమ బాల పురస్కార్ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న జ్యోతిక

సుల్తానాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరోనా విపత్కర సమయంలో చేసిన సేవా కార్యక్రమాలతోపాటు దుబారా ఖర్చులు వద్దని చేస్తున్న ప్రోగ్రాంలకు గాను సుల్తానాబాద్‌కు చెందిన చిన్నారులు ఏగోలపు జ్యోతిక, ఏగోలపు కౌశిక్‌లకు జాతీయ ఉత్తమ బాల పురస్కార్ అవార్డు-2024 అందించారు. మార్క్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు నీరజ గొనె, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చేరిపెల్లి దినేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవ అవార్డు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ స్పీకర్ మధుసూదనాచారి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, పుష్పచంద్రశేఖర్‌లు అవార్డు అందించారు.

నాచుపల్లి జేఎన్‌టీయూలో విద్యార్థి అదృశ్యం

కొడిమ్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న ఎ హితేష్ అదృశ్యమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి ప్రభాకర్ తెలిపారు. హితేష్ ఈ నెల 19న అనుమతి లేకుండ హాస్టల్ నుంచి వెళ్లినట్లు తెలిపాడు. హాస్టల్ కేర్ టేకర్, తోటి విద్యార్థుల ద్వారా అదృశ్యం విషయం తెలుసుకొని కొడిమ్యాల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. హితేష్ ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం జిల్లా దరువుబిల్లి మండలం రావివలస గ్రామానికి చెందినవాడని చెప్పారు. విద్యార్థి దృశ్యంపై గురువారం మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు విచారణ చేపట్టారు. ఈ మేరు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు పశువులు మృతి

సిరిసిల్ల క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం మొదటి బైపాస్ రహదారిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు పశువులు మృతిచెందాయి. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దూమాల రంజిత్ అనే రైతుకు చెందిన అయిదు పశువులు(బర్రెలు) రహదారి వైపునకు మేతకు వెళ్లాయి. గుర్తుతెలియని వాహనం ఢీకొనగా రెండు అక్కడికక్కడే మృతిచెందగా మరో మూడు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి.

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో పెళ్లి కావడం లేదని యువకుడు ఉరివేసుకున్నాడు. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి ఓ వ్యక్తి అనారోగ్యంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట కు చెందిన ఓ యువకుడు దుబాయ్‌లో బలవన్మరణానికి పాల్పడ్డాడు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో ఉరివేసుకున్నాడు.

- పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



సంతోష్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పెళ్లి చేయడం లేదని మనస్తాపం చెందిన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన దంపెటి సంతోష్ (25) అనే యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణం లోని నెహ్రూనగర్‌కు చెందిన నేత కార్మిక కుటుంబమైన దుంపెటి లలిత, భూమయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. నేత కార్మికుడైన భూమయ్య పవర్‌లూం పని చేస్తూ అప్పుడప్పుడు కూలీకి వెళ్తుంటాడు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేయడంతో ఐదు లక్షల రూపాయలకు పైగా అప్పులు అయ్యాయి. కుమారుడు సంతోష్ ప్లంబింగ్ పని చేస్తుంటాడు. పెళ్లి చేయాలని తరుచుగా తల్లిదండ్రులను అడిగినప్పటికీ అప్పులు కావడంతో ఇప్పుడే ఎందుకని చెప్పడంతో సంతోష్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగుతున్నాడని కుమారుడికి ద్విచక్రవాహనం ఇవ్వడం మానేశారు. ఇప్పట్లో తనకు పెళ్లిచేయరని మనస్తాపం చెందిన తల్లిదండ్రులు ఉన్న గదికి తాళం వేసి మరో గదిలో సంతోష్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని బల వన్మరణానికి ఒడిగట్టాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

- అనారోగ్యంతో మనస్తాపం చెంది..

కోనరావుపేట, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన మానుపాటి చంద్రయ్య (57) అనే వ్యక్తి గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రయ్య కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై భార్య లక్ష్మి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై ప్రశాం త్‌రెడ్డి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను పరిశీ లించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు రాజు, శంకర్ ఉన్నారు.

- దుబాయ్‌లో మొగిలిపేట వాసి బలవన్మరణం



శ్రీనివాస్(ఫైల్)

మల్లాపూర్, నవంబరు, 21 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని మొగిలిపేటకు చెందిన ఓ యువకుడు దుబాయ్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొగిలిపేట గ్రామానికి చెందిన దండ్ల శ్రీనివాస్ (34) అనే యువకుడు మూడేళ్ల క్రితం జీవనోపాధి కోసం దు బాయ్ వెళ్లాడు. పనులు ముగియగానే లీవు దొరకగానే ఇంటికి తిరిగి వస్తానని చెప్పిన యువకుడు దుబాయిలో ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వృద్ధురాలైన తల్లి, భార్య, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు. లీవు దొరికితే ఇంటికి వస్తానని భార్య పిల్లలతో ఫోన్‌లో మాట్లాడిన శ్రీనివాస్ బలవన్మరణం పొందిన సమాచారం తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువుల్లో విషాదం నెలకొంది. శ్రీనివాస్ మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తెప్పించాలని, బాధిత కుటుం బాన్ని ఆదుకోవాలని వడ్డెర సంఘం నాయకులు మోహన్, సాయిరామ్, తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.

- కుటుంబకలహాలతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

తంగళ్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్‌కె అన్వర్(33) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల కథనం ప్రకారం.. జిల్లెల్ల గ్రామానికి చెందిన అన్వర్ కొద్ది సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబంతో సిద్దిపేటకు వలస వెళ్లి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య భర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం అన్వర్ భార్య ఆఫ్రీన్, ఇద్దరు కుమార్తెలు సాన(9), ఆయాష(7), కుమారుడు ఇమామ్(2)ను తీసుకుని భర్త నుంచి దూరంగా వెళ్లిపోయింది. భార్య పిల్లలు వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన అన్వర్ సిద్దిపేట నుంచి నాలుగు రోజుల క్రితం స్వగ్రామం జిల్లెల్లకు వచ్చాడు. గురువారం రాత్రి జిల్లెల్ల శివారులోని రాములోని బండ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని శవమై కనిపించాడు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూనిఫాంపై మక్కువతోనే..

- కానిస్టేబుల్ ఉద్యోగుల్లో ఉన్నత విద్యావంతులే అధికం


కుటుంబ సభ్యులతో అభ్యర్థి

కరీంనగర్ క్రైం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఇంటర్ అర్హత అయినప్పటికీ పీజీ, ఇంజనీరింగ్, బీఫార్మసీ, డిగ్రీ చదివిన ఉన్నత విద్యావంతులు, కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పరీక్ష రాసి ఎంపికయ్యారు. పోలీస్ యూనిఫాంపై ఉన్న మోజు లేదా గౌరవం యువతను పోలీసుశాఖలో ఉద్యోగం చేయాలనే పట్టుదలను, ఇష్టాన్ని పెంచిందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. కరీంనగర్‌లోని సిటీ ట్రైనింగ్ సెంటర్(సీటీసీ), పోలీస్ శిక్షణ కళాశాల(పీటీసీ)లో 9 నెలలపాటు కానిస్టేబుల్ శిక్షణ పొందారు. .

● పోలీసుశాఖలో చేరాలనే కోరికతో....

- చింతల సాయికిరణ, యాదాద్రి జిల్లా భువనగిరి



చిన్నప్పటి నుంచి పోలీసు యూనిఫాంపై మక్కువ ఉండేది. మా బావ పోలీసు ఉద్యోగం చేస్తున్నాడు తాను కూడా ఎలాగైనా పోలీసు ఉద్యోగం చేయాలనే సంకల్పంతో పరీక్షరాసి మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. ఎమ్మెస్సీ పూర్తిచేశాను. మొదటి పోటీ పరీక్షరాయగా కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పరిగణలోకి తీసుకుని నీతి, నిజాయితీగా పనిచేస్తూ ప్రజలకు అన్ని విధాల సేవలు అందిస్తాను.

● కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావటం ఆనందంగా ఉంది

- బోయిని యాదగిరి, యద్రాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపూర్



బీఫార్మసీ పూర్తిచేశాను. ఇదే సమయంలో పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ పడగా దరఖాస్తు చేసి మొదటి సారి పరీక్షలో ఉద్యోగానికి ఎంపికయ్యాను. సామాన్య ప్రజలకు న్యాయం అందించటం, రక్షణ కల్పించటం, క్రమశిక్షణ కలిగిన కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరటం ఆనం దంగా ఉంది, మా తల్లిదండ్రులు కూడా సంతోషంగా ఉన్నారు. ఈ శిక్షణలో పోలీసుల విధులు, సేవలు, చట్టాలు, అమలు అంశాలపై క్షున్నంగా నేర్చుకున్నాం. ముఖ్యంగా ఫిట్‌నెస్ సాధించాం.

● తండ్రి లేని లోటు లేకుండా పెంచాను

- ఉట్ల సాయి సుమన్ తల్లి రమ, యాదాద్రి జిల్లా బ్రాహ్మణపల్లి



వ్యవసాయంలో పంట దిగుబడి రాక అప్పుల బాధతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురు, కొడుకులను నా తండ్రి సహాయంతో కష్టపడి ఇద్దరు పిల్లలను పెంచాను. తండ్రిలేని లోటు రాకూడదని గ్రామంలో ఆశావర్కర్‌గా పనిచేసుకుంటూ సాయి సుమన్‌ను ఇంజనీరింగ్ చదివించాను. పోలీసుశాఖలో ఉద్యోగం కోసం కొడుకు ఇదివరకు ఒక సారి పరీక్ష రాశాడు. కాని రాకపోవటంతో రెండవసారి పరీక్షరాసి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావటం సంతోషంగా ఉంది.

పోలీస్‌శాఖ గౌరవాన్ని పెంచాలి


ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్‌కు ట్రోఫీని అందజేస్తున్న డిజి కమలాసన్‌రెడ్డి


ప్రతిజ్ఞ చేస్తున్న ట్రైనింగ్ పూర్తిచేసుకున్న కానిస్టేబుల్స్

- డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి
- పీటీసీ, సీటీసీల్లో శిక్షణ పూర్తి చేసుకున్న 1,350 కానిస్టేబుళ్లు
- దీక్షాంత్ పరేడ్ హాజరైన పోలీస్ ఉన్నతాధికారులు

కరీంనగర్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నిజాయితీతో ప్రజలకు సేవ చేస్తూ పోలీస్‌శాఖ గౌరవాన్ని పెంచాలని డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని పోలీస్ శిక్షణ కళాశాల(పీటీసీ)లో 1,102 ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్ల, సిటీ ట్రైనింగ్ సెంటర్(సీటీసీ)లో రాచకొండ


కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డిజి కమలాసన్‌రెడ్డి

కమిషనరేట్‌కు చెందిన 248 మంది ఏఆర్ కానిస్టేబుళ్ల 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి చేశారు. గురువారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ విబి కమలాసన్‌రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి హాజరయ్యారు. సీటీసీలో జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథికి కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, సీటీసీ ప్రిన్సిపాల్ అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఏసీపీ వేణుగోపాల్ పూల మొక్కలతో స్వాగతం పలికారు. పరేడ్ కమాండర్ గౌరవ వందనం అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ ట్రైనింగ్‌లో చేరిన 248 మందిని తీర్చి దిద్దిన సీటీసీ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ఎంతో కష్టపడి విజయవంతంగా పూర్తి చేసినందుకు వారందిరినీ అభినందిస్తున్నామన్నారు. శిక్షణలో చాలా వరకు ఉన్నత చదువులు అభ్యసించిన వారే ఉండడం సంతోషం కలిగించిందన్నారు. పోలీస్‌శాఖలో చేరినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. పోలీస్ ఉద్యోగం అంటేనే త్యాగానికి ప్రతీక అన్నారు. ఉద్యోగంలో నిత్యం అనేక సవాళ్లు ఎదురవు తాయని, వాటిని ఎదుర్కొని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. పోలీస్ శాఖలో ఎంతో నిజాయితీతో, అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తామని ట్రైనీ కానిస్టేబుళ్లచేత సీటీసీ ప్రిన్సిపా ల్, అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ ప్రమాణం చేయించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టే బుళ్లు దీక్షాంత్‌పరేడ్ చేశారు. సీటీసీలో 2019- 20లో మీయావాకి పద్ధతిలో ఏర్పాటు చేసిన చిట్టడవిని సంరక్షిస్తున్నందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఏసీపీ వేణుగోపాల్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ విజయ్‌కుమార్


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కరీంనగర్ రాంనగర్‌లోని పోలీస్ శిక్షణ కళాశాలలో 1,102 మంది (సివిల్, ఏఆర్) శిక్షణ పొందారు. ఈ కార్యక్రమములో పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్ అధ్వర్యంలో జరగగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ విజయ్‌కుమార్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణార్థులు సాంకేతికతను మెరుగు పరుచుకొని చట్టాలపై అవగాహన పెంచుకుంటూ మానసికంగా, శారీరకంగా సన్నద్ధం కావాలి అన్నారు. అలాగే ఉద్యోగంలో క్రమశిక్షణతో పాటు ప్రజల హక్కులను కాపాడుతూ వారి పట్ల మర్యాదగా వ్యవహరిరచాలన్నారు. శిక్షణ కానిస్టేబుళ్లు చేసే ప్రతి చర్య కూడా డిపార్ట్మెంట్ గౌరవం పెంచేవిగా ఉండాలన్నారు. వృత్తి పరంగా, నడవడిక పరంగా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. చెడు ఎక్కడ ఉన్నా దానిని అణచి వేసే దిశగా అడు గువేయాలని అన్నారు. పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ కానిస్టేబుళ్ల 9 నెలల శిక్షణ పూర్తి అయిందని తెలిపారు. డీజీపీ (ట్రైనింగ్) అభిలాష్ బిస్త్ సూచనల మేరకు శిక్షణ స్థాయిని, కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్‌ఐ స్థాయికి పెంచి మారుతున్న అవసరాలకనుగుణంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

గంజాయి సాగుచేస్తున్న వ్యక్తి పై కేసు నమోదు

సారంగాపూర్, నవంబరు, 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి సాగుచేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల మేరకు రేచపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి తిరుపతి అనే వ్యక్తి తన వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నడన్న సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా తన భూమిలో 9 పచ్చని గంజాయి చెట్లు, 300 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు, రూ, 97,500. పంచుల సమక్షంలో పంచనామ చేసి సీజ్ చేశారు. అతడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

మంథని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి వారి నుంచి 1.232 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్లు సీఐ రాజు గురువారం తెలిపారు. సీఐ రాజు కథనం ప్రకారం.. మంథని ఎస్‌ఐ రమేష్ అందిన నమ్మదగ్గ సమాచారం మేరకు సిబ్బంది రమేష్, వెంకటేశ్వర్లు, అనిల్‌లతో కలిసి మున్సిపల్ పరిధిలోని కుచిరాజ్‌పల్లి గ్రామ శివారులో మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులను పట్టుకొని తనిఖీ చేయగా కవరల్లో గంజాయి లభించిందన్నారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి గ్రామానికి చెందిన నక్క ప్రేమస్, మండలంలోని లక్కెపూర్ గ్రామానికి మోహమ్మద్ అర్శత్‌లు ఇచ్చినట్లు తేలిందని, వీరిద్దరికి గంజాయి తాగే అలవాటు ఉందని, కొంత వీరు తాగి మిగితాది చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి ఒక్కొక్క ప్యాకెట్ రూ.500 లకు అమ్ముకుంటారని వారు వెల్లడించి నట్లు తెలిపారు. 20 రోజుల క్రితం తాము మహారాష్ట్రలోని సిర్వోంచ మండలంలోని యాటపల్లి గ్రామానికి చెందిన సమీర్ వద్ద రెండు కిలలో గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చారని వివరించారు. ఇందులో కొంత తమ స్నేహితు లైన రత్న బన్నీ, కళ్యాణ్, వివ, రమేష్‌లకు విక్రయించారిన తెలిపారు. మిగిలింది వారు తాగి, మళ్లీ ఎవరికైనా అమ్ముతామని తమవద్ద ఉంచుకున్నారన్నారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. యువత వ్యసనాల బారిన పడకుండా క్రమశిక్షణతో చదవాలని సూచించారు.

ధర్మపురి ఆలయ అభివృద్ధికి సీఎం కృషి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మపురి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం అభివృద్ధి కోసం సీఎం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి గురువారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్దాల చరిత్ర కలిగి ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి ప్రభుత్వ విప్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరినట్లు ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పినట్లు ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్ద పీట వేసినట్లు ఆయన తెలిపారు. రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉనట సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ 2 లక్షలు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. గత ఆగస్టు 15 వరకు రైతులకు రూ 18,000 కోట్ల రుణమాఫీ చేసినట్లు ఆయన వివరించారు. దీనికి తోడు రైతులు విక్రయించే సన్న రకం వరి ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి, రూ 500 బోనస్ అందిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, సుముఖ్, స్తంభంకాడి గణేష్, షబ్బీర్ పాల్గొన్నారు.

అధునాతన టెక్నాలజీతో జైళ్ల నిర్మాణం

- జైళ్లశాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం సంపత్



మాట్లాడుతున్న జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డిప్యూటీ జనరల్ సంపత్

కరీంనగర్ క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాల్లో అధునాతన టెక్నాలజీతో జైళ్లను నిర్మిస్తున్నామని జైళ్లశాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం సంపత్ అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని జైలు అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పునశ్చరణ తరగతులు గురువారం కరీంనగర్ జైలులో ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్ హాజరై మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో అధునాతన టెక్నాలజీతో జిల్లా జైలును నిర్మిస్తున్నామన్నారు. ఇతర జిల్లాల్లో కూడా అధునాతన టెక్నాలజీతో జైళ్ళను నిర్మించి, ఖైదీల రద్దీని తగ్గిస్తామని తెలపారు. మరో అతిథి శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ జైళ్ల శాఖ తీసుకుంటున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, సంస్కరణలు గురించి కొనియాడారు. కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రీజినల్ లెవల్ రిట్రీట్‌లో బాగంగా ఖైదీల సంక్షేమం, సిబ్బంది సంక్షేమం, క్రమశిక్షణ, ఆరోగ్యం, సెక్యూరిటీ గురించి చర్చించి భవిష్యత్తులో జైళ్ల శాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జైలు వైద్య అధికారి డాక్టర్ కె వేణుగోపాల్, సైకియాట్రిస్ట్ ఎల్ వర్షి, అప్పన్న గారి వెంకట్రావు, జైలర్స్ పి శ్రీనివాస్, రమేష్, పర్శరామ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్‌రెడ్డి, రమేష్, సంగీత, మినిస్టీరియల్, మెడికల్ సిబ్బంది, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ నిజామాబాద్ జిల్లాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ


లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. కార్తీక మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో నదిలో కార్తీక దీపాల వదిలారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపిం చారు. స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


గోదావరి నది వద్ద హారతి పూజలు చేస్తున్న అర్చకులు

20 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 20 వ రోజు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం నుంచి నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితుల మంత్రో చ్చరణల మధ్య అర్చకులు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాజన్న ఆలయంలో పూజలు


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసంను పురష్కరించుకుని ప్రతి నిత్యం రద్దీ కొనసాగుతోంది. గురువారం రోజున వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి రాజన్నను దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకుని తరించారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

వేములవాడ, కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. రాజన్న ఆలయ కళాభవన్‌లో పర్యవేక్షకుడు సంజీవ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్తీక దీపోత్సవం సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఓం, స్వస్తిక్ ఆకృతుల్లో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కోరుట్లలో వేంకటేశ్వర కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోరుట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం గురువారం వేదపండితులు బీర్నంది నర్సింహచారీ మంత్రోచ్ఛారణల మధ్య సాగింది. దేవాలయంలో అర్చన అభిషేకార్యక్రమాలను నిర్వహించిన పురోహితులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక వేదికపై స్వామి వారి కల్యా ణాన్ని నిర్వహించారు. శ్రీలలితా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో పూలతో ముగ్గులను వేసి వాటి వద్ద కార్తిక దీపాలను వెలింగించారు. కార్యక్రమంలో దేవాలయ ఈవో విక్రం, దేవాలయ సిబ్బంది పెడిపల్లి నర్సయ్య, శ్రీలలిత సేవా ట్రస్ట్ అధ్యక్షురాలు అడ్డగట్ల లక్ష్మి, సభ్యులు తనుగుల రాజశేఖర్, గుండోజీ మనోహర్, గోడికె రాములులతో పాటు పలువురు పాల్గొన్నారు.

75శాతం హాజరు తప్పనిసరి

గణేశ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న డిగ్రీ, పీజీ విద్యార్థులకు 75శాతం హాజరు తప్పనిసరి అని వీసీ ఉమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ హాజరు నమోదైతే వారిని పరీక్షలకు అనుమతించబోమని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుల ప్రాణాలు గాలికి..

- సంవత్సరాలుగా అందని బూట్లు
- ఊసేలేని సబ్బులు, నూనె
- మూడేళ్లుగా అందని ఆర్జిత సెలవు సొమ్ము


జగిత్యాల మున్సిపల్ కార్మికులు

జగిత్యాల అర్బన్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) కరోనా వచ్చినా.. కలరా వచ్చినా.. వాన అయినా.. వరదైనా అలుపెరుగకుండా పనిచేసేది పారిశుధ్య కార్మికులు. వారు పనిచేయకుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఎంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. అలాంటి పారిశుధ్య కార్మికులకు వారి రక్షణ కోసం కల్పించాలని సౌకర్యాలు కల్పించడం లేదు. జగిత్యాల మున్సిపాటీలో మొత్తం 305 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో 265 మంది కాంట్రాక్టు కార్మికులు కాగా మిగతా 40 మంది పర్మనెంట్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరి రక్షణ కోసం ప్లాస్టిక్ బూట్లు సంవత్సరానికి ఓసారి ఇవాల్సి ఉంది. ప్రస్తుత మునిపల్ కౌన్సిల్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఓసారి బూట్లు ఇచ్చిన అధికారులు మళ్లీ ఇప్పటి వరకు ఒక్క సారి కూడా బూట్లు ఇవ్వలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మురికాలువల్లో చెత్తను తొలగించే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అనేక సార్లు మురికి కాలువల్లోకి దిగాల్సి ఉంటుంది. అలా దిగే క్రమంలో కార్మికుల కాళ్లకు గాజు పెంచుల లాంటివి గుచ్చకుండా బూట్ల అవసరం ఉంటుంది. నిత్యం మురికితో సావాసం చేసే కార్మికులకు పనిచేసే సమయంలో ఒంటికి పట్టిన మురికిని వదలించుకునేందుకు ప్రతి నెలా ఒకటి చొప్పున సంవత్సరానికి పన్నెండు బట్టల, పన్నెండు స్నానానికి సబ్బులు ఇవ్వాల్సి ఉంది అయితే అయిదేళ్లుగా ఇప్పటి వరకు ఒకటి రెండు సార్లు మాత్రమే సబ్బులు ఇచ్చారని కార్మికులు అంటున్నారు. దీంతో పారిశుధ్య కార్మికులపై పాలక వర్గానికున్న నిర్లక్షాన్ని ప్రతిబింబిస్తున్నది. అలాగే కార్మికులకు ఏటా ఐదు కిలోల కొబ్బరి నూనె ఇవ్వాల్సి ఉండగా ఈ అయిదు సంవత్సరాల కాలంలో ఒక్కసారి మాత్రమే అధికారులు కొబ్బరి నూనె ఇచ్చినట్లు కార్మికులు చెబుతున్నారు.

పర్మనెంట్ కార్మికులకు ఇవ్వాల్సిన ఆర్జిత సెలవులు మూడు సంవత్సరాలుగా మంజూరు చేయక పోవడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల రక్షణ కోసం మురికి కాలువల్లో దిగి తమ ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

పూర్తి వివరాలు తెలుసుకుని సమస్య పరిష్కరిస్తాం

- చిరంజీవి మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

పారిశుధ్య కార్మికులకు ఏటా ఒక సారి ఇవ్వాల్సిన సబ్బులు, నూనె, కాళ్లకు బూట్లు రెండు, మూడు సంవత్సరాలుగా ఇవ్వని విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. దానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకొని కౌన్సిల్ ఆమోదంతో త్వరలో సమస్య పరిష్కరిస్తా. అలాగే అర్జిత సెలవుల విషయం కార్మికులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం.

న్యూస్ బాక్స్

షీ టీమ్స్‌పై అవగాహన

పాలకుర్తి, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : మండల పరిధిలోని బసంత్‌నగర్ ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం షీ టీమ్స్‌పై అవగాహన కల్పించారు. షీ టీమ్ ఇన్చార్జి ఏఎస్‌ఐ మల్లయ్య ప్రిన్సిపాల్ గాయిత్రి దేవి పాల్గొన్నారు.

24న అడహక్ కమిటీ

ధర్మారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మాల, మాల ఉపకులాల అడహక్ కమిటీ ఈనెల 24న వేయబడుతుందని, ఇందుకు అన్ని గ్రామాల వారు హాజరుకావచ్చని మాల సంఘ నాయకులు తెలిపారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మాలల సింహగర్జన సభకు తరలి వెళ్లాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాడె సూర్యనారాయణ, దేవి జనార్ధన్, దేవి రాజమల్లయ్య, దేవి రాజలింగు, దేవి అంజయ్య, దేవి రమణ, బొడ్డు రాములు, భారత స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

రామగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల కృష్ణవేణి పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం శ్రీకాంత్ డెంటల్ వైద్య ఆసుపత్రి వైద్య బృందం విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలను చేపట్టారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్లశ్రీనివాస్, దంత నిపుణులు రేణుక, సిరిచందన, శివకృష్ణలు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ పోటీలు

ఎలిగేడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎలిగేడు పాఠశాల విద్యార్థులకు మండల విద్యాధికారి నరేంద్రచారి అభినందనలు తెలిపారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గంప్ర దేవేందర్‌రావు, బిజిలి సదయ్య, సైన్స్‌టీచర్లు అరుణకుమారి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కుమారస్వామి, సీఆర్‌పి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో గురువారం విద్యార్థులకు మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ప్రథమ బహుమతులు మల్యాల మోడల్ స్కూల్‌లో చదువుతున్న సహర్షవర్షి ని, సాయిశివాని, సంతోష్ ద్వితీయ బహుమతులు పెగడపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు రశ్మిత, శ్రవణ్, సాయి రాములు సాధించినట్లు ఎంఈవో మహేష్ తెలిపారు. సునీత, మల్లారెడ్డి పాలొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

కమాన్‌పూర్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): మండలకేంద్రంతో పాటు రొంపికుంట, జూలపల్లి గ్రామాల్లో గురువారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కళాకారులు దయానర్సింగ్, జనగామ రాజనర్సున, కొంద్ర వెంకన్న, రవీందర్, రమ, శ్రావణ్, స్పందనలున్నారు.

బెదిరింపులపై ఫిర్యాదు

పెద్దపల్లి రూరల్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని పెద్దబొంకూరుకు అనుకొని ఉన్న హుస్సేన్‌మియా వాగు నుంచి ఇసుక తీయవద్దు అన్నందుకు కొందరు ట్రాక్టర్ యజమానులు చంపుతామని బెదిరిస్తున్నారని గురువారం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు బాధితుడు మిట్టపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. వెంట కలవేన సదానందం, కలవేన రవి ఉన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

అంతర్గాం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని హ్యూమన్ రైట్స్‌కౌన్సిల్ ఫర్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కొండల రాజేందర్ అన్నారు. గురువారం కుందనపల్లి పంచాయతీ పరిధిలోని అక్బర్‌నగర్ ఇంటెలిజెన్స్ కమిటీ ఆధ్వర్యంలో రాజేందర్‌కు సన్మానం చేశారు. చాంద్‌పాషా, రవీందర్, పాల్గొన్నారు.

ముదిరాజుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. గురువారం మండలంలోని పెగడపల్లి గ్రామంలోని తెనుగుపల్లెలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై నూతనంగా ఏర్పాటుచేసిన మత్స్య శాఖ లోగోను ఆవిష్కరించారు. అనంతరం మత్స్యశాఖ జెండాను ఎమ్మెల్యే విజయరమణారావు ఎగురవాశారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ముదిరాజులు, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ ముదిరాజులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ముదిరాజులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేస్తుందన్నారు. గ్రామాల్లో చెరువులు అన్యక్రాంతం అవుతున్నాయని, అన్యక్రాంతమైన భూములను గుర్తించి చెరువు సరిహద్దులు ఏర్పాటుచేసే విధంగా త్వరలోనే చర్యలు చేపడతామన్నారు. ముదిరాజులంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిల్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సదయ్య, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, మాజీ సర్పంచ్ ఆరెల్లి సుజాతరమేష్, మాజీ ఎంపీటీసీ సుంకం నిర్మలమల్లారెడ్డి, ముదిరాజ్ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు తూడి సదయ్య, ఉపాధ్యక్షుడు కల్వల తిరుపతి, ప్రధాన కార్యదర్శి పెండం సతీష్, సాయిరాం, చినవేని రాజేందర్, రెడ్డి అంకుష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

● మంథని (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని మంథని-బోయినిపేట మత్స్య కార్మికులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా మత్స్యకార్మి క సహకారం సంఘం డైరెక్టర్ పోతరవేన క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో మత్స్యకారులంతా బోయినిపేట నుంచి ర్యాలీగా పట్టణ పుర వీధుల్లో పర్యటించారు. సంఘ నేతలు అంకరి కుమార్, లింగయ్య, సబ్బని సమ్మయ్య, పోలు కనుకరాజ్, సబ్బని సంతోష్, గంధం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం జెండాలను ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. సబ్బు శ్రీధర్, తూడి గణేష్, ముత్యం లచ్చయ్య, యాదగిరి రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడుకాపూర్‌లో ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి ఆలయం ఆవరణలో జెండాను ఎగురవేశారు. సంఘం అధ్యక్షుడు కనకట్ల స్వామి, ఉపాధ్యక్షుడు జెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తూకం వేసి ట్యాబ్‌లో నమోదుచేయాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు

కాల్వశ్రీరాంపూర్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం తూకం అయిన వెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సందర్శించారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో పరిశీలించి వరిధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ధాన్యం తూకం వేసిన వెంటనే ట్యాబ్‌లో నమోదు చేస్తే రైతులకు ధాన్యం డబ్బులతో పాటు బోనస్ డబ్బులు కూడా జమ అవుతాయన్నారు. కొనుగోలు కేంద్రంకు వరిధాన్యం తెచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి రాజేందర్, తహసీల్దార్ ఎండి.వకీల్, ఏవో నాగార్జున, డిప్యూటీ తహసీల్దార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్ల వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

టెక్నికల్ కోర్సు పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : టెక్నికల్ కోర్సు పరీక్షలకు డిసెంబర్ 3లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఎగ్జామినేషన్స్ సంచాలకులు టెక్నికల్ కోర్సు పరీక్షలు జనవరి 2025 సంబంధించి లోయర్, హైయర్ గ్రేడ్ డ్రాయింగ్ టైలరింగ్ ఎంబ్రాయిడరీలో గుర్తించబడిన కేంద్రాలలో నిర్వహించబడతాయని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారంలు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రూప్-2 మాక్‌టెస్ట్‌లు..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్, హైదరాబాద్ వారిచే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2కు సంబంధించిన రెండు ఉచిత ఫుల్‌లెంగ్త్ మాక్‌టెస్ట్‌లను డిసెంబర్ 2,3,9,10 తేదిలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రంగారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైస్‌మిల్లుల్లో సక్రమంగా ధాన్యం దిగుమతి చేసుకోవాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతి చేసే ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సుల్తానాబాద్ మండలం పూసాల గ్రామంలో ఉన్న వసుంధర రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైస్ మిల్లుకు అలాట్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చింది. వాటి వివరాలను అందుకు సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యంకు సంబంధించి రైస్ మిల్లుల వద్ద త్వరగా దిగుమతి చేసుకునేలా చూడాలన్నారు. రైస్ మిల్లులు వద్ద ఎక్కువ సమయం ధాన్యం వాహనాలు వెయిట్ చేయకుండా చూడాలన్నారు. అవసరమైన మేర హమాలీలు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను త్వరితగతిన ఓపీఎంఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని అన్నారు.

ఈ తనిఖీలో కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 72,951 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : కలెక్టర్

పెద్దపల్లి, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత సంవత్సరంకంటే 60 శాతం అధికంగా ధాన్యం కొనుగోలు పూర్తిచేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2023లో నవంబర్ 21 నాటికి 6512 మంది రైతుల నుండి 100 కోట్ల 30 లక్షల విలువ గల 45 వేల 439.28 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 1762 మంది రైతులకు 25 కోట్ల పది లక్షల నగదు చెల్లించామని తెలిపారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024లో నవంబర్ 21 నాటికి గత ఏడాది కంటే 60% అధికంగా ధాన్యం కొనుగోలు చేసిన ధాన్యంలో 73% రైతులకు వడ్ల డబ్బులు చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత సంవత్సరం ఇప్పటి వరకు 11 వేల 193 మంది రైతుల నుంచి 72 వేల 951.8 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 8356 మంది రైతులకు 123 కోట్ల 75 లక్షల పైగా ధాన్యం డబ్బులు చెల్లించామని తెలిపారు. భారతఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకుని వస్తే వెంటనే కొనుగోలు చేస్తాన్నామని, నాణ్యత ప్రమాణాలను పరీక్షించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'రుడా'తో ఊరట

(5వ పేజీ తరువాయి)

చేస్తున్న 25వేల మంది కాంట్రాక్టు కార్మికులకు లబ్ధి చేకూరనున్నది. జిల్లాలోని ఎన్‌టీపీసీలో 3500మంది, ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 1100మంది, సింగరేణిలోని ఆర్‌జీ-1, 2, 3లలో 7వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. దీనికి తోడు కేశోరాం సిమెంట్స్, రైల్వే, మిషన్ భగీరథ, హెచ్‌పీసీఎల్, ఐఓసీ, బీఎస్‌ఎన్‌ఎల్, పోస్టల్, సీఎంపీఎఫ్ కార్యాలయం, ఆర్‌టీసీతో పాటు జిల్లాలోని రైస్‌మిల్లు ఆపరేటర్లు కూడా దీని పరిధిలోకి వస్తారు. ఒక్కో కార్మికునికి సరాసరి నెలవారీగా రూ.3500 నుంచి రూ.4000వరకు వేతన ప్రయోజనం కలగనున్నది. వేతనంతో పాటు చట్టబద్ధమైన ప్రయోజనాలు, సెలవులు, బోనస్ ఇతర పెరుగుదల కూడా ఉంటుంది.

● పట్టణాభివృద్ధి శాఖ నిర్ణయమే కీలకం..

రుడా ఏర్పాటుతో అభివృద్ధితోపాటు బీ గ్రేడ్ హోదా కూడా రుడా సాధించడం కీలకం. ప్రభుత్వం రుడా ఏర్పాటు చేస్తూ జీవో నెం.165జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్ చేయా ల్సిందిగా ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ ప్రతిపాదనల పరిశీలన తరువాత బీ గ్రేడ్ క్యాటగిరి కేటాయించే అవకాశం ఉంటుంది. ఇందులో పట్టణాభివృద్ధి శాఖ నిబంధనలు అనుసరించి ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు జిల్లా మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, లక్ష్మణ్ కుమార్‌ల ప్రయత్నం కూడా కీలకం.

కాంట్రాక్టు కార్మికులకు ప్రయోజనం..

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

'రుడా' ఏర్పాటు కావడం వల్ల కాంట్రాక్టు కార్మికులకు బీగ్రేడ్ వేతనం లభించనున్నది. ఎన్నో ఏళ్లుగా కార్మికులు బీగ్రేడ్ కోసం పోరాడుతున్నారు. చేసే పని ఒక్కటే అయినా వరంగల్‌కు, జిల్లాకు వేతనాల్లో తేడా ఉంది. చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. బీ గ్రేడ్ లభిస్తే వారి వేతనాల్లో పెరుగుదల ఉండడంతో పాటు ఇతర ప్రయోజనాలు కలుగనున్నాయి. భవిష్యత్‌లో సింగరేణి వంటి సంస్థల్లో కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గనుల కార్మికులకు హెచ్‌ఆర్‌ఏలో పెంపుదల అవకాశం ఉంటుంది.

కన్నుల పండువగా గోదావరి మహా హారతి

అంతర్గాం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరి తీరం వద్ద గోదావరి మహాహారతి ఉత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా గోదావరి నదికి హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, ఉత్సవ సమితి నాయకుడు క్యాతం వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడకుంట సుభాష్, ప్రభాకర్‌రెడ్డి, నరసింహచారి, రామాచారి, మల్లేష్ పాల్గొన్నారు

మెరుగైన దీపావళి బోనస్ చెల్లించాలి

- కేశోరాం కాంట్రాక్టు కార్మికుల నిరసన

పాలకుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బసంత్‌నగర్ కేశోరాం కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన దీపావళి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం కంపెనీ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఆ యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆందోళనలో పాల్గొన్న యూనియన్ ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ గత సంవత్సరం లోడింగ్ కార్మికులకు రూ.46 వేల 700, జనరల్ కారికులకు 46వేల200 దీపావళి బోనస్ ఇచ్చారని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను, కార్మికుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈసారి దీపావళి బోనస్ రూ.52వేలు కావాలని తమ యూనియన్ అధ్యక్షుడు పలుసార్లు కంపెనీ అధికారులతో చర్చలు జరిపారని తెలిపారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, టూల్ డౌన్‌లాంటి నిరసన కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా ఇక్కడి అధికారులు కంపెనీ ఉన్నతాధికారులకు ఇక్కడి కార్మికుల ఆందోళనలు వివరించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు ఉదృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఊషన్నపల్లి పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ముసుగు శ్రీనివాస్ అనే బ్యాంకు ఉద్యోగి 3 ఫాన్లను అందజేశారు. గురువారం ఆయన ముసుగు సతీష్, ముసుగు మధూకర్, ముసుగు తిరుపతిలతో కలిసి పాఠశాలకు విచ్చేసి ఫాన్లను విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు అమృత, సురేస్‌కుమార్‌లు అభినందనలు తెలిపారు.

రామగుండం అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలి

కళ్యాణ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాలు అభివృద్ధికి సహరించాలే తప్ప అభివృద్ధి నిరోధకులు కారాదని కాంగ్రెస్ కార్పొరేటర్ మహంకాళి స్వామి అన్నారు. గురువారం రామగుండం ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాల్వ లింగస్వామితో కలిసి ఆయన మాట్లాడారు. రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి రూ.350కోట్లు, పవర్‌ప్లాంట్‌కు రూ.8500 కోట్లు, మేడిపల్లి ఓసీపీలో పవర్ ప్రాజెక్టు కోసం రూ.350కోట్లు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కే దక్కుతుందన్నారు. పదేళ్లుగా మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ రామగుండం అభివృద్ధికి ఒక్క రూపాయి అయినా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, కార్పొరేటర్లు ఎండీ ముస్తాఫా, శంకర్ నాయక్, బొమ్మక రాజేష్, గట్ల రమేష్, మారెల్లి రాజిరెడ్డి, సింహాచలం పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహంకాళి స్వామి

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కోల్‌సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా హోసూర్ కోర్టులో కన్నన్ అనే న్యాయవాదిని కోర్టు ఆవరణలో దుండగులు హత్య చేయడాన్ని నిరసిస్తూ ఖని కోర్టులో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈమేరకు గోదావరిఖని మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్‌తో పాటు సీనియర్ సివిల్ జడ్జి, అదనపు జిల్లా న్యాయ స్థానంలో కోర్టు కేస్ కార్యకలాపాలు నిలిచిపోయాయి.

ఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ విధుల బహిష్కరణ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు తౌటం సతీష్, జవ్వాజి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు రాంటెంకి శ్రీనివాస్, గోషిక ప్రకాష్, ప్రవీణ్ కుమార్, లింగస్వామి, భానుకృష్ణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న నగదు, సెల్‌ఫోన్ల అప్పగింత

కళ్యాణ్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వస్తున్న మార్కండేయ కాలనీకి చెందిన రజిత, అఖిల అనే ప్రయాణీకురాలు గురువారం గోదావరిఖని డిపోకు చెందిన టీఎస్ 02 యూబీ 9326 పల్లె వెలుగు బస్సులో బ్యాగును మరిచిపోయింది. గమనించిన కండక్టర్, డ్రైవర్ బ్యాగును డిపో మేనేజర్ నాగభూషణంకు అప్పగించగా అందులో రూ.78వేల నగదు, రూ.40వేల విలువైన రెండు సెల్‌ఫోన్లను గుర్తించారు. ప్రయాణీకురాల వివరాలు తెలుసుకుని డిపో మేనేజర్ నాగభూషణం బ్యాగును రజిత, అఖిలకు అందజేశారు. నిజాయితీని చాటుకున్న కండక్టర్ వనిత, డ్రైవర్ నాగేంద్రను డిపో మేనేజర్ నాగభూషణం, అసిస్టెంట్ డిపో మేనేజర్ గీత కృష్ణ, మేనేజర్(ట్రాఫిక్) లింగయ్య తదితరులు అభినందించారు.



బ్యాగును అందజేస్తున్న డిపో మేనేజర్ నాగభూషణం



సీఐటీయూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 సీటీయూ ఆఫీస్‌లో గురువారం సీపీఎం మహాసభల పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు ఉల్లి మొగిలి ఈసందర్భంగా మాట్లాడారు. ప్రజా సమస్యలే ఈనెల 23, 24 తేదీల్లో జిల్లా ఎజెండాగా సీపీఎం మూడవ మహాసభ ఎన్టీపీసీలో జరగనున్నట్టు పేర్కొన్నారు. ప్రజల మౌలిక సమస్యలు, ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో కార్మికుల ఉద్యోగ భద్రత, అసంఘటిత రంగాల 73వ షెడ్యూల్ కార్మికుల వేతనాలపై, రైతాంగ చట్టాల మార్పు, గిట్టుబాటు ధరల వంటి సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు. గడిచిన మూడేళ్లలో పార్టీ చేసిన కార్యక్రమాలు, పోరాటాలను సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్టు మొగిలి పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు, జిల్లాలోని వివిధ పరిశ్రమలకు చెందిన కార్మికులు మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో లక్ష్మణ్, వేల్పుల రవి, రషీద్‌ఖాన్, రాజు, శంకర్, భూమయ్య, సారంగం, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యైటింక్లయిన్‌కాలనీ సంతోష్‌నగర్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెడికోవర్ హాస్పిటల్ సహకారంతో సింగరేణి ఉద్యోగులు, రిటైర్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈశిబిరంలో 150 మందికి వైద్యులు బీపీ, మధుమేహం, ముందస్తు గుండె జబ్బులను గుర్తించే నిర్ధారణ పరీక్షలు చేశారు. బీపీ, మధుమేహం ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. పౌష్టికాహారం, వ్యాయామం చేడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, తరచూ వైద్య పరీక్షల ద్వారా రానున్న అనారోగ్య సమస్యలకు ముందుగా చికిత్స తీసుకుంటే ప్రణాపాయం లేకుండా జాగ్రత్త పడవచ్చని వైద్యుడు దీక్షిత్ పండిత్ తెలిపారు. ఈవైద్య శిబిరంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, డివిజన్ అధ్యక్షుడు అనుము రాములు, డివిజన్ కార్పోరేటర్ సాగంటి శంకర్, నాయకులు కిషన్‌నాయక్, మార్క రాజు, రాజేశం, లక్ష్మణరావు, సుధాకర్, రమేష్, రాంరెడ్డి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఓసీపీ-3ని తనిఖీ చేసిన డైరెక్టర్(పా)

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఓసీపీ-3 ప్రాజెక్టును గురువారం సింగరేణి డైరెక్టర్(పా, పీపీ) వెంకటేశ్వరెడ్డి తనిఖీ చేశారు. వ్యూ పాయింట్ నుండి ప్రాజెక్టు పని స్థలాలను పరిశీలించి, క్వారీలోకి దిగి పైలట్ క్వారీలో బొగ్గు ఉత్పత్తి, రవాణాను పరిశీలించారు. ప్రాజెక్టుకు కేటాయించిన వార్షిక లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఓబీ వెలికితీత, బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ఆటంకాలు ఏర్పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డైరెక్టర్ వెంట ఆర్జీ-2 జీఎం వెంకటయ్య, జీఎం ఎస్టేట్స్ రాధాకృష్ణ, ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం ఎర్రన్న, మేనేజర్ భరత్‌కుమార్, సర్వే అధికారి నర్సింగరావు, ఎస్ఎస్‌వో మహమ్మద్ షరీఫ్ ఉన్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

యూనియన్ నేతలతో అధికారుల సమావేశం

రామగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో గురువారం యూనియన్ నేతలతో ఉన్నతాధికారులు నిర్మాణాత్మక సమావేశాన్ని నిర్వహించారు. ఏరియాలకు సంబంధించి పలు అంశాలపై ప్రధానంగా చర్చించారు. సింగరేణిలోని వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల భర్తీ, ఓసీపీ-2లో డోజర్, డంపర్‌లలో ఎసీల మరమ్మతులు, సెంటినరీకాలనీ-గోదావరిఖని ప్రధాన రహదారి 4లైన్ల విస్తరణ, సెంటినరీకాలనీలో తాగునీటి సమస్యను అధిగమించడం, సీహెచ్‌పీ కార్మికులకు 2023-24 సంవత్సరానికి సంబంధించిన స్పెషల్ ఇన్సెంటివ్‌తో పాటు తదితర అంశాలపై చర్చలు జరిపారు. ఈ సమావేశంలో చర్చించిన సమస్యల పరిష్కారానికి ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు సానూకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో అధికారులు శేఖర్‌బాబు, రఘుపతి, సత్యనారయణ, నాగేశ్వర్‌రావు, వెంకటరమణ, చంద్రశేఖర్, సుదర్శనం, నాయకులు గడ్డం తిరుపతి, రామారావు, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష క్యూబిక్ మీటర్ల ఓబీని వెలికితీయాలి

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలో రోజువారీగా లక్ష క్యూబిక్ మీటర్ల ఓబీని వెలికితీయాలని, 12వేల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని డైరెక్టర్(ప్రాజెక్ట్‌అండ్ ప్లానింగ్) జి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్‌తో కలిసి గనిలోని పని స్థలాలను పరిశీలించారు. ఉపరితలగని ప్లాన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. క్వారీలోని కోల్‌బెంచ్‌లను, ఆఫ్‌లోడింగ్ ప్రదేశాలను తనిఖీ చేశారు. ఉత్పత్తి పెంపుదలకు తగిన సూచనలు ఇచ్చారు. రక్షణతోకూడిన ఉత్పత్తి సాధించాలని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఇందారం ఓసీపీ పీవో ఏపీ రెడ్డి, క్వాలిటీమేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ సంపత్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

ఎస్టేట్స్ జనరల్ మేనేజర్‌కు సన్మానం

నూతనంగా బాధ్యతలు చేపట్టి శ్రీరాంపూర్ ఏరియాకువచ్చిన ఎస్టేట్స్ జీఎం రాధాకృష్ణను ఏరియాఇన్‌చార్జి జీఎం టిశ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ పెద్దపల్లి సర్కిల్ ఎస్ఈగా మాధవరావు

పెద్దపల్లి, నవంబర్ 21 (ఆంధ్ర జ్యోతి): ఎన్‌పీడీసీఎల్ పెద్దపల్లి సర్కిల్ ఎస్ఈగా మాధవరావును నియమిస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్ఈగా పని చేసిన బొంకూరి సుదర్శన్ నిర్మల్ జిల్లాకు బదిలీ చేశారు. గురువారం కొత్తగా వచ్చిన ఎస్ఈ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించాలన్న సంకల్పంతో టోల్‌ఫ్రీ నంబర్ 1912 అన్ని ట్రాన్స్‌ఫార్మర్లపై ముద్రిస్తున్నామని తెలిపారు. ఈ టోల్‌ఫ్రీ నంబర్ 24/7 అందుబాటులో ఉంటుందని వ్యక్తం చేశారు. ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తినా టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ప్రతి ఒక్క వినియోగదారుడు గుర్తు పెట్టుకునేలా టోల్‌ఫ్రీ నంబర్ 1912ను విస్తృతంగా ప్రచారం చేపడుతున్నామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు, విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా, బిల్లులో ఏమైనా హెచ్చుతగ్గులు ఉన్నా, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరుకు సంబంధించిన పేరు మార్పు, కేటగిరీ మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యల కొరకు టోల్‌ఫ్రీ నంబర్‌కు సంప్రదించి సేవలు పొందగలరని ఎస్ఈ కోరారు.



ఎస్ఈ మాధవరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు, ఉద్యోగులు

అగంతకుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దు..

- రామగుండం కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామంటూ చెప్పి రుసుము చెల్లించి డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలంటూ అగంతకులు చేస్తున్న ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని కమిషనర్ అరుణశ్రీ కోరారు. డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉందని అన్నారు. ఇంటర్‌నెట్, మీసేవా కేంద్రం, స్మార్ట్ ఫోన్‌లో సిటిజెన్ బడ్డీ యాప్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాల కొరకు రామగుండం నగర పాలక సంస్థ లైసెన్స్ విభాగంలో సంబంధిత అధికారి ఫోన్ నెం.9966626680లో సంప్రదించవచ్చని తెలిపారు. భారీ జరిమానాల బారిన పడకుండా త్వరపడి వ్యాపారులు డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు.